క్లుప్తంగా

మల్లయ్యకొండకు పశుగ్రాసం వితరణ



పశుగ్రాసాన్ని వితరణగా ఇచ్చిన దాత మధుకర్‌రెడ్డి

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై పశువులకు బి.కొత్తకోట మండలం కనికలతోపు దిన్నేమీద పల్లెకు చెందిన రైతు మధుకర్‌రెడ్డి ఒక ట్రాక్టర్ (వరిగడ్డి) సోమవారం వితరణగా అందజేశారు. సొంత ఖర్చులతో పశుగ్రాసాన్ని మల్లయ్యకొండకు చేర్చారు. ఆయన దాతృత్వాన్ని ఈఓ మునిరాజ, కొండకిట్ట, పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున, భక్తులు అభినందించారు.

దివ్యాంగుడిని ఆదుకుంటాం



దివ్యాంగుడి విషయమై చర్చిస్తున్న అధికారులు

పీలేరు : కొద్దిరోజులుగా స్థానిక మదనపల్లె మార్గంలోని బోడేశావలి దర్గా ఆవరణలో ఆశ్రయం పొందుతున్న దివ్యాంగుడు జీవాను ఆదుకుంటామని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, సీఐ యుగంధర్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దివ్యాంగుడి కుటుంబ సభ్యులకు అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చారు. వారు మాట్లాడుతూ బాధితుడిని బాగా చూసుకోవాలని, ప్రభుత్వపరంగా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ముంబైకి చెందిన కార్మిక సంఘం నాయకురాలు డాక్టర్ జమీలాబేగం తనవంతు సాయంగా దివ్యాంగుడి కోలుకునే వరకు ఆర్థికసాయం అందిస్తానని చెప్పారు. అనంతరం జీవాను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లోకేష్, బహుజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎ.బలరాం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె : మండలంలో ఖాళీగా ఉన్న ఆరు చౌకదుకాణాల డీలర్ల నియామకానికి ఈనెల 21వతేదీ లోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. వెంకటరెడ్డిగారిపల్లె (బీసీ–బీ) కేటగిరి, రెడ్డివారిపల్లె (ఓసీ–మహిళ), తిమ్మయ్యగారి ఇండ్లు (బీసీ–బీ), చెరువుముందరపల్లె (బీసీ–బీ మహిళ), గంగిరెడ్డిపల్లె (బీసీ–బీ), తంబళ్లపల్లె షాపు 36 ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్థిక సుస్థిరాభివృద్ధిపై శిక్షణ

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీల ఆర్థిక సుస్థిరాభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. ఈ శిక్షణకు ఈఓఆర్డీ, ఎంపీహెచ్‌ఓ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఏపీఎంలు హాజరు కావాలని కోరారు.

తంబళ్లపల్లెలో..

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యంపై శిక్షణా శిబిరాలు జరుగుతాయని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, కార్యాలయ ఏఓ థామస్ లిపారు. గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని కోరారు.

సంతాపం

మదనపల్లె సిటీ : ప్రముఖ తబలా కళాకారుడు జాకీర్‌హుస్సేన్ మృతికి స్థానిక మదనపల్లె రచయితల (మరసం) కార్యాలయంలో సోమవారం సాయంత్రం సంతాపం ప్రకటించారు. ఆయన మృతి కళారంగానికి తీరని లోటని మరసం కార్యదర్శి లింగాల యుగంధరాచారి తెలిపారు. కార్యక్రమంలో మరసం అధ్యక్షులు ప్రసాద్, రచయితలు నాగభూషణరావు, వాసుదేవరావు, నాగరాజు, కరుణాకర్, మంజుప్రీతం, రాఘవేంద్రబాబు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి

మదనపల్లె సిటీ : హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యదర్శి భానుప్రకాష్ కోరారు. సోమవారం స్థానిక సొసైటీకాలనీలోని రామాలయంలో హైందవ శంఖారావం మహాసభ విజయవంతానికి సన్నాహక సమావేశం జరిగింది. విజయవాడలో జనవరి 5వ తేదీన శంఖారావం సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె పెన్నానది నుంచి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను సోమవారం స్వాధీనం చేసుకున్నామని ఒంటిమిట్ట సీఐ టి.బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ అవసరాల నిమిత్తం మాత్రమే ఉచిత ఇసుక విధానం అమలు చేసిందన్నారు. అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా కడప నగరానికి ఇసుక తరలిస్తున్న విషయాన్ని స్థానికులు సమాచారం ఇవ్వడంతో మాచుపల్లె, కడప రహదారిలో రెండు వాహనాలను పట్టుకొని సిద్దవటం తహసీల్దార్‌కు అప్పజెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎస్‌ఐ శివప్రసాద్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో సోమవారం వైభవంగా ధనుర్మాస పూజలు నిర్వహించారు. స్వామికి సహస్రనామ అష్టోత్తర పూజలు అర్చకులు గోవర్దన్ భట్టార్ చేశారు. గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

స్థానిక బర్మావీధిలోని శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు


రామసముద్రం : రామసముద్రం మండలం కర్ణాటక సరిహద్దులోని గుట్టపాళ్యం సమీపంలో వెలసిన శ్రీ బంగారు బైరేశ్వరస్వామికి ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అనిల్, స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఆంధ్ర, కర్ణాటకలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలుచేసి స్వామివారికి మొక్కులు చెల్లించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ, దర్శనభాగ్యం కల్పించారు. అలాగే బజారువీధిలో వెలసిన వాలీశ్వరస్వామి ఆలయంలో అర్చకులు తిన్నిలి స్వామి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

అంగళ్లు మల్లయ్య కొండపై ప్రత్యేక పూజలు

కురబలకోట : అంగళ్లు మల్లయ్య కొండపై సోమవారం పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంగళ్లు గ్రామ కార్యదర్శి తీగల ఉదయ్ కుమార్, తీగల భాగ్యలక్ష్మి, తీగల లక్ష్మీపతి, మహిమ, దొనశ్రీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె సిటీ : ప్రత్యేక అలంకరణలో శ్రీప్రసన్న వెంకటరమణస్వామి



రామసముద్రం: ప్రత్యేక అలంకారంలో శ్రీ బంగారు బైరేశ్వరస్వామి

• శివ పార్వతుల కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం : మార్గశిర మాసం అరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం స్థానిక శివాలయంలో శివ పార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో వేద పండితులు వేణుగోపాల శర్మ, శేషాచలం విగ్రహ ప్రతిమలను ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



శివ,పార్వతుల కల్యాణోత్సవ దృశ్యం

• యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం

మదనపల్లె సిటీ : స్థానిక బెంగుళూరురోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఆలయంలో స్వామికి రుద్రాభిషేకం చేశారు. ఆలయాన్ని ప్రత్యేక పూలతో అలంకరించారు. ఆలయ ఆవరణంలో స్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ రమణ, ఆలయ సిబ్బంది అంకన్న, రాజశేఖర్ పాల్గొన్నారు. స్థానిక సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో యోగభోగేశ్వరుడు

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 80 అర్జీలు

మదనపల్లె : స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో 11 మండలాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు 80 అర్జీలను అందజేశారు. పోతబోలు పంచాయతీ గాండ్లపల్లెకు చెందిన రైతు అక్కులప్ప తన పేరుపై ఉన్న 50 సెంట్ల భూమిని అధికారులు 5 సెంట్లుగా నమోదుచేశారని, దీనిని సవరణ చేయాలని పలుసార్లు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఫిర్యాదుచేశారు. మదనపల్లె మండలం చిప్పిలి బంగారు కొత్తపేటలో దాదాపు 15 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నామని, కాలనీకి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఫిర్యాదుచేశారు. గ్రామస్తులు ప్రభుత్వభూమిలో రాకపోకలు సాగిస్తుండగా, అదే గ్రామానికి చెందిన కృష్ణప్ప, ఆక్రమించుకుని దున్నేయడంతో రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. అలాగే మౌలికవసతులు లేకపోవడంతో మురుగు ఇళ్ల మధ్యే ఉంటూ అనారోగ్యానికి గురవుతున్నామని వాపోయారు.



రోడ్డు సౌకర్యం కల్పించాలని సబ్ కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న చిప్పిలి బంగారు కొత్తపేట కాలనీవాసులు

శుభాకార్యాల్లో పాల్గొన్న చింతల

వాల్మీకిపురం(కలికిరి) : శుభ కార్యక్రమాలకు హాజరైన పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వధువు, వరులను ఆశీర్వదించారు. వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి పంచాయతీ పుల్లేటి చెరువుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.హరినాథ రెడ్డి కుమార్తె భావన వివాహం సందర్భంగా వారి ఇంటికి వెళ్లి ఆశీర్వదించారు. అలాగే వాల్మీకిపురంలోని రామ్‌నగర్‌కు చెందిన కె.సురేంద్రరెడ్డి కుమారుడు నరేష్‌కుమార్‌రెడ్డి వివాహం సందర్భంగా వారి ఇంటికి వెళ్లి ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీళ్ల భాస్కర్, ఆనందరెడ్డి, బిడ్డల కేశవరెడ్డి, జర్రావారిపల్లి విశ్వనాథ, కువైట్ శంకర్ తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో నిబంధనలు బేఖాతరు

గుర్రంకొండ : ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో నిబంధనలు పాటించడంలేదనే వాదనను రైతులు తెలియజేస్తున్నారు. మండంలోని పలు గ్రామాల్లో రైతులు బోర్లు వేసుకొని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం గతంలో దరఖాస్తులు చేసుకున్నారు. నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకొన్న రైతులకు వరుస క్రమంలో విద్యుత్ కనెక్షన్లతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు అధికారులు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ట్రాన్స్‌కో అధికారులు నిబంధనలకు నీళ్లు వదిలి గ్రామాల్లో ఇష్టానుసారంగా వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఇంతవరకు వ్యవయసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోని వారికి సైతం ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దరఖాస్తు చేసుకొని నెలల తరబడి వేచి చూస్తున్న రైతులకు మాత్రం ట్రాన్స్‌పార్మర్లు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో సీరియల్‌గా ఒకరైతు పేరుమీద మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ట్రాన్స్‌కో సిబ్బంది అనధికారికంగా అనర్హులైనవారికి, దరఖాస్తు చేసుకోని వారికి ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఇటీవల రామాపురంలో రైతులు, ట్రాన్స్‌కో సిబ్బంది మధ్య వాగ్వాదం. తమకు జరిగిన అన్యాయంపై రైతులు ట్రాన్స్‌కో సిబ్బందిని ప్రశ్నించినా సరైన సమాధానం ఇవ్వలేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అర్హులకు ట్రాన్స్‌ఫార్మర్లు దక్కేలాగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

నిమ్మనపల్లె : పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓలు ఎం.ఆర్. పద్మావతి, నారాయణ ఆకాంక్షించారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో, ఉపాధ్యాయులతో కలసి యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన పదో తరగతి మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా యూటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన మోడల్ పేపర్స్ ద్వారా పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ ఏడాది కూడా విద్యార్థులు మోడల్ పేపర్స్ చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. యూటీఎఫ్ మోడల్ పేపర్స్ విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు ఎం.గోబ్రియా నాయక్, గౌరవ అధ్యక్షులు రవీంద్ర, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, మండల ఉపాధ్యాయులు శంకరప్ప, సీఆర్పీలు పద్మనాభం, స్వాతి, ఎం ఆర్ సి సిబ్బంది సౌజన్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతి మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, యూటీఎఫ్ నాయకులు

రాష్ట్రకమిటీలో పుల్లయ్యకు చోటు

రాజంపేట టౌన్ : యాదవ ఎంప్లాయిస్ సొసైటీ రాష్ట్ర కమిటీలో రాజంపేట మండలం ఊటుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోగల పుల్లయ్యకు చోటు దక్కింది. ఈనెల 15వ తేదీ గుంటూరులో జరిగిన రాష్ట్ర కమిటీ ప్రతినిధుల సమావేశంలో యూనియన్ నాయకులు తనను రాష్ట్ర కమిటీకి ఎన్నుకున్నట్లు పుల్లయ్య సోమవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. యాదవ ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

నేడు మాజీ ఎమ్మెల్యే గాలివీటి విశ్వనాథరెడ్డి వర్ధంతి

వీరబల్లి : లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే కీ.శే. గాలివీటి విశ్వనాథరెడ్డి 8వ వర్ధంతి వేడుకలు మంగళవారం (నేడు) మండల కేంద్రంలో నిర్వహించనున్నట్టు ఆయన కుమారులు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని తెలియజేశారు.

బీసీ గురుకులం నిర్మాణానికి స్థల పరిశీలన

కలికిరి : మండల పరిధిలోని గుట్టపాళెం పంచాయతీ వాడావాండ్లపల్లి బస్టాప్ సమీపంలో గత ప్రభుత్వం మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలం కేటాయించింది. సోమవారం ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రవీంద్రబాబు పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అలానే నిర్మాణాలకు సంబంధించిన డీపీఆర్ ఉన్నతాధికారులకు పంపనున్నట్టు ఆయన తెలియజేశారు. కాగా గత ప్రభుత్వం శాశ్వత భవనాల నిర్మాణానికి రూ.3.95 కోట్లను కేటాయించింది. శాశ్వత భవనాలు అందుబాటులోకి వస్తే విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి. ప్రస్తుతం గురుకుల పాఠశాల పడా బిల్డింగ్ నిర్వహిస్తున్న విధితమే. ఇందులో కాంట్రాక్టరు జీఎల్ ప్రసాద్, గురుకుల ప్రిన్సిపల్ వై.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గుట్టపాళెంలో పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

‘ఎవరికీ సెలవులు మంజూరు చేయలేదు’

పెద్దతిప్పసముద్రం : మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తూ సెలవులు పెట్టినట్లు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన సిబ్బంది సెలవులను తాను ఆమోదించలేదని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మండలంలోని టి.సదుం, బూర్లపల్లి పంచాయతీ కార్యదర్శులతో పాటు కాట్నగల్లు డిజిటల్ అసిస్టెంట్‌లు పోస్టు ద్వారా మండల పరిషత్ కార్యాలయాలకు పంపిన సెలవు ఉత్తర్వులను తాను తిరస్కరించానన్నారు. విధులకు గైర్హాజరై అనధికారింగా వెళ్లిన వారి నిర్లక్ష్య వైఖరిపై నివేదిక తయారు చేసి శాఖా పరమైన చర్యల నిమిత్తం జిల్లా ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలో అసలే సిబ్బంది కొరత. ఆపై కీలకమైన శాఖలకు సంబంధించిన అధికారులు ప్రత్యామ్నాయంగా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అంతేగాక పలువురు ఉద్యోగులు ఏదో ఒక సాకుతో సెలవులో వెళుతున్నామని రిజిస్టర్ పోస్టు ద్వారా మండల పరిషత్ కార్యాలయానికి లేఖలు పంపుతున్నారు. దీంతో ఉన్న అరకొర సిబ్బందిపై అదనపు పని భారం పడుతోందని సిబ్బంది వాపోతున్నారు.

అన్నదానం

రామాపురం : లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో మండలంలోని బండపల్లె వద్ద ఉన్న ప్రేమాలయం వృద్ధాశ్రమంలో సోమవారం వీరబల్లి మండలం సానిపాయి గ్రామానికి చెందిన పైడి వెంకటయ్య 3వ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధ్యక్షులు లయన్ శివారెడ్డి, జోన్ చైర్మన్ లయన్ మహమ్మద్‌లు పేర్కొన్నారు.

విస్తృత సేవా కార్యక్రమాలకు కృషి

పీలేరు : వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పీలేరుకు చెందిన సోమిశెట్టి సురేష్ బాబు ఎన్నికయ్యారు. శనివారం, ఆదివారం మధురైలో రెండు రోజులపాటు జరిగిన లెజెండ్ ఐకాన్ కార్యక్రమంలో ఆయనను ఎన్నిక, ప్రమాణ స్వీకారం చేసినట్టు ఆయన సోమవారం ఇక్కడి విలేకరులకు తెలియజేశారు. కాగా 2024 సంవత్సరానికి సురేష్‌బాబు ఆధ్వర్యంలో చేసిన సేవలకు బెస్ట్ డిస్ట్రిక్ట్ 211ఏ గవర్నర్‌గా నిర్వాహకులు సత్కరించి బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ తరఫున విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.



సురేష్‌బాబును సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

ఏపీకు సత్కారం

నందలూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వర్తించి డిప్యుటేషన్‌పై కమలాపురానికి వెళ్తున్న ఏఓ అనంత ప్రకాష్‌ను మండల పరిషత్ అధ్యక్షులు మేడా విజయభాస్కర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాతమ్మ, మండల కో–ఆప్షన్ సభ్యులు కరిముల్లాఖాన్, కాంట్రాక్టర్ నదివీధి సుధాకర్, వెంకటరమణ, ప్రభాకర్, వెంకటేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగళ్లులో పోలీస్ స్టేషన్ స్థలానికి పటిష్ట భద్రత

కురబలకోట : కురబలకోట మండలంలోని అంగళ్లు కుమ్మరి ఫ్యాక్టరీ వద్ద పోలీస్ స్టేషన్ స్థలానికి పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. అన్యాక్రాంతం కాకుండా జేసీబీతో చదును చేసి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ఇది టమాటా మండీల ముందు భాగంలో ఉన్న విలువైన స్థలం. అదీ హైవే పక్కన ఉండడంతో భూ కబ్జాకు గురి కాకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఇక్కడ సర్వే నంబరు 363/1లో 2019లో పది సెంట్ల స్థలాన్ని అప్పటి ప్రభుత్వం పోలీస్ స్టేషన్‌కు కేటాయించింది. పోలీస్ స్టేషన్ స్థలానికి వెనుక అక్కడ వైఎస్సార్‌సీపీ నాయకురాలు రెడ్డి (డిష్)కుమారి కట్టించిన సాక్షి గణపతి ఆలయానికి కూడా పోలీసులు దారి వదిలారు.



అంగళ్లులో పోలీస్ స్టేషన్ స్థలానికి ఫెన్సింగ్ వేయిస్తున్న పోలీసులు

సాయుధ దళాల త్యాగాలను గౌరవించాలి

పీలేరు రూరల్ : దేశ సాయుధ దళాల త్యాగాలను గౌరవించాలని స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు నారాయణ అన్నారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో విజయ్ దివస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1971 డిసెంబర్ 16న జరిగిన యుద్ధంలో భారతదేశం సాధించిన విజయాన్ని గుర్తు చేసుకుంటూ విజయ్ దివస్ వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. వీర జవాన్‌ల త్యాగాలు దేశభక్తిని, ఐక్యత, సమగ్రత, విలువలను యువతలో నూరిపోస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యాపకులు నారాయణ

సచివాలయాలకు చంద్ర గ్రహణం!

సుండుపల్లె : గతంలో గ్రామీణులు ఏ చిన్న పని ఉన్నా వేకువజామునే లేచి మండల కేంద్రానికో.. జిల్లా కేంద్రానికో బయలుదేరేందుకు సిద్ధమవ్వాల్సి ఉండేది. దీంతో ఉదయం పూట చేసుకునే వ్యవసాయ పనులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. పైగా సమస్యపై రోజుల కొలది కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు అయ్యేవికావు. ఇది గ్రహించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం తీసుకురావాలనే బృహత్ సంకల్పంతో పంచాయతీ కేంద్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి రైతులు, గ్రామీణులకు సమస్యల పరిష్కార వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి, ప్రజలకు 139 రకాల సేవలను అందించేవారు. ప్రతి రోజూ గ్రీవెన్స్ ఏర్పాటు చేసి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపేవారు. అలానే రైతులు, గ్రామీణులకు అవసరమైన ధృవీకరణ పత్రాలు సచివాలయాల ద్వారా పొందేవారు. అలానే సంక్షేమ పథకాలు అందించడంలోనూ ఈ వ్యవస్థ క్రియాశీలకంగా వ్యవహరించింది.

కూటమి పాలనలో సచివాలయాలకు..

వైఎస్ జగన్ ప్రభుత్వంలో మహర్దశ పొందిన సచివాలయాలకు 2024 ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సచివాలయాలు చిన్నచూపునకు గురయ్యాయి. ప్రజలకు 139 రకాల సేవలను అందించే సచివాలయాల్లో 75 శాతం పైగా సేవలను కూటమి ప్రభుత్వం దూరం చేసింది. దీంతో ఏ పథకానికి పేర్లు నమోదు చేసుకోవాలన్న మీ–సేవ కేంద్రాలకు లబ్ధిదారులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు గత ప్రభుత్వం చెల్లిస్తూ వచ్చిన పంట బీమా పథకం ప్రీమియంను తీసివేసింది. దీంతో రైతులే బీమా కోసం ప్రీమియం చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. పైగా వీటిని నమోదు చేసుకునేందుకు మీ–సేవ కేంద్రాల బాట పట్టాల్సి వస్తోంది. జగన్ ప్రభుత్వంలో ఇంటికే వచ్చి వలంటీర్లు సంక్షేమ పథకాలకు పేర్లు నమోదు చేసుకుని లబ్ధి చేకూర్చేవారని కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం పింఛన్లకు, రేషన్ కార్డులకు పేర్లు నమోదు చేసుకుందామని సచివాలయాలకు వెళితే సర్వర్ పని చేయడంలేదని చెబుతుండటంతో మండలంలోని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.



సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్, సచివాలయ సిబ్బంది (ఫైల్)

సంక్షేమ సారథులు వలంటీర్లు

గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందాయి. ఇందులో ప్రధాన భూమిక పోషించింది వలంటీర్లే అని చెప్పాలి. ఏ పథకమైన ప్రతి అర్హుడికి అందాలనే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా వలంటీర్లు పని చేశారు. అలానే కరోనా కష్టకాలంలో వీరు చేసిన సేవలు వెలకట్టలేనివి. కాగా గతంలో చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థపై నోరుపారేసుకున్నప్పటికీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్ల వ్యవస్థను కొనసాగించి వారి గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక వలంటీర్ల వ్యవస్థ అనేది లేదని, వాటిని కొనసాగించడం అనే ప్రశ్న ఉత్పన్నం కాదని అసెంబ్లీ సాక్షిగా తన మంత్రుల ద్వార తెలియజేసి వలంటీర్లను వెన్నుపోటు పొడిచాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావొస్తున్న వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వలంటీర్లు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నప్పటికీ తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటం వలంటీర్లను, ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. కాగా మండలంలో గ్రామ సచివాలయాల సంఖ్య 15, సచివాలయాలలోని ఉద్యోగస్తులు 133 మంది, మండలంలో సచివాలయాలలో వలంటీర్లు 258 మంది పని చేస్తున్నారు.

అంగళ్లు సర్పంచ్ విశ్వారెడ్డిపై కేసు అక్రమమే.!

కురబలకోట: మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు, అంగళ్లు గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డిపై కేసు అక్రమమేనని వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు పలువురు ఇతర పార్టీల నాయకులు కూడా పేర్కొంటున్నారు. అధికార పార్టీ టీడీపీ నాయకులు కూడా జైలులో ఇతన్ని పరామర్శించేందుకు రావడం గమనార్హం. అజాత శత్రువుగా పేరు తెచ్చుకోవడమే ఇందుకు కారణం. 20 ఏళ్లుగా ఆయన కుటుంబీకులు అంగళ్లు రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. అంతేగాకుండా సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి ఎరుగని వారిగా అంగళ్లు గ్రామ చరిత్రలో రికార్డు సృష్టించారు. ఇలాంటి కుటుంబానికి చెందిన వ్యక్తిపై ఊహించని విధంగా ముదివేడు పోలీసులు హత్యాహత్నం కేసు నమోదు చేసి రిమాండుకు పంపడం సంచలనంగా మారింది. అంగళ్లు కుమ్మరి ఫ్యాక్టరీ వద్ద పోలీస్ స్టేషన్ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించారన్నది పోలీసుల అభియోగం. దీనికితోడు పోలీసుపై కూడా దాడికి యత్నించారని కేసులో పేర్కొన్నారు. ఆయన ఎప్పుడూ ఒకరితో వివాదం పడటం.. గొడవకు వెళ్లిన దాఖలాలు ఇన్నేళ్లలో ఎవ్వరూ చూడలేదు. ఇప్పటికీ ఆయనపై ఎలాంటి కేసులు కూడా లేవు. భూకబ్జాల జోలికి అసలు వెళ్లరు. అలాంటి వ్యక్తి భూ కబ్జాకు యత్నించారనడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఆదివారం ఇంటి వద్ద ఉన్న ఆయనను పోలీసులు వచ్చి ఎస్‌ఐ పిలుస్తున్నాడని చెప్పి స్టేషన్‌కు తీసుకెళ్లారు. అంతే అప్పటికే అక్కడ ఉన్న వైఎస్సార్‌సీపీకి చెందిన రెడ్డికుమారి, జిల్లా నాయకుడు ముత్ర దామోదర్ రెడ్డితో కలిపి సర్పంచ్ విశ్వారెడ్డిపై కూడా నాన్ బెయిల్‌బుల్ కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. మదనపల్లె సబ్ జైలులో ఉన్న ఆయనను పలకరించేందుకు సోమవారం జనం పోటెత్తారు. తప్పుడు కేసులతో వేధించాలని చూస్తే ఎవ్వరూ భయపడేవారు లేరని వైఎస్సార్‌సీపీ శ్రేణులు చెబుతున్నాయి.



పోరెడ్డి విశ్వారెడ్డి (ఫైల్)

ఉజ్వల భవిష్యత్తుకు పిల్లలను బడికి పంపండి

ఓబులవారిపల్లె : ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు పిల్లలను పనులకు కాకుండా బడికి పంపాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి తెలియజేశారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల కిషోర్ వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం నేరమని, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ఈ విషయంపై అవగాహన కల్పించుకోవాలన్నారు. అనంతరం ముక్కవారిపల్లి వైద్యాధికారిణి రూప మాట్లాడుతూ నిర్దేశించిన వయస్సులో వివాహాలు జరిపించాలని లేదంటే ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. ఐసీడీఎస్ సీడీపీఓ సౌభాగ్యమ్మ మాట్లాడుతూ బడి బయట ఉన్న విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సరళ, కో–ఆర్డినేటర్ శంకర్, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.